# లక్ష్మీనరసింహుడికి దర్బార్ సేవోత్సవం



స్వామి, అమ్మవార్ల ఊరేగింపులో పాల్గొన్న అర్చకులు, భక్తులు

యాదగిరిగుట్ట, డిసెంబర్13: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామికి బుధవారం దర్బార్ సేవోత్సవం అత్యంత వైభవంగా సాగింది. సాయంత్రం ప్రధానాలయ ముఖ మండపంలో ఉత్సవమూర్తులకు నాలుగు వేదాల పారాయణం చేసి, స్వామివారి స్వస్తీ మంత్రాలతో శాంతింపజేశారు. స్వామివారికి నక్షత్ర హారతినిచ్చి మంత్రపుష్ప నిరాజనం చేసి ఆశీర్వచనం చేశారు. సుమారు అరగంట పాటు సాగిన సేవలో భక్తులు పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. తెల్లవారు జామునే ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతంతో స్వయంభూ నారసింహస్వామిని మేల్కొలిపారు. అనంతరం తిరువారాధన జరిపి, ఉదయం ఆరగింపు చేపట్టారు. స్వయంభూ ప్రధానాలయంలో స్వామివారికి నిజాభిషేకం జరిపారు. తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన చేపట్టి భక్తులకు స్వామి, అమ్మవార్ల దర్శన భాగ్యం కల్పించారు. స్వామి, అమ్మవార్ల నిత్య తిరుకల్యాణోత్సవం అత్యంత వైభవంగా సాగింది. అర్చక బృందం గంటన్నర పాటు శాస్త్రోక్తంగా కల్యాణ తంతు జరిపారు. ప్రధానాలయం వెలుపలి ప్రాకార మండపంలో సుదర్శన ఆళ్వారులను కొలుస్తూ హోమం జరిపారు. స్వామి, అమ్మవార్లను దివ్యమనోహరంగా ముస్తాబు చేసి గజవాహనంపై వేంచేపు చేసి వెలుపలి ప్రాకార మండపంలో ఊరేగించారు. అనంతరం శ్రీలక్ష్మీసమేతుడైన కల్యాణమూర్తులను ముస్తాబు చేసి భక్తులకు అభిముఖంగా అధిష్టించి నిత్యకల్యాణ తంతును నిర్వహించారు. సాయంత్రం స్వామివారికి తిరువీధిసేవను వైభవంగా చేపట్టారు. అనంతరం స్వామివారిని గజవాహనంపై, అమ్మవారిని తిరుచ్చి సేవపై వేంచేపు చేసి తిరుమాఢ వీధుల్లో ఊరేగించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు దర్శనాలు కొనసాగాయి. బుధవారం సుమారు 15 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు అంచనా వేశారు. అన్ని విభాగాలను కలుపుకొని స్వామివారి ఖజానాకు రూ.22,65,421 ఆదాయం సమకూరిందని ఆలయ ఈఓ ఎన్.గీత, అనువంశిక ధర్మకర్త బి. నరసింహమూర్తి తెలిపారు.

## బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు ప్రముఖుల పరామర్శ







హైదరాబాద్ సోమాజిగూడలోని యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను బుధవారం శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, సూర్యాపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, హుజూర్‌నగర్ మాజీ ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి పరామర్శించారు.

–సూర్యాపేట టౌన్, డిసెంబర్13



ఏర్పాట్లను పరిశీలిస్తున్న అడిషనల్ డీసీపీ రవికుమార్

## రాష్ట్రపతి పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు

భూదాన్‌పోచంపల్లి, డిసెంబర్ 13 : రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈ నెల 20న భూదాన్‌పోచంపల్లికి రానున్నందున అధికారులు అందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నారు. స్థానిక బాలాజీ ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాట్లను అడిషనల్ డీసీపీ రవి కుమార్, జిల్లా చేనేత జౌళీశాఖ ఏడీ విద్యాసాగర్ బుధవారం పరిశీలించారు. పోలీస్ స్టేషన్ పక్కనే హెలిప్యాడ్ స్థలాన్ని పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా అడిషనల్ డీసీపీ మాట్లాడుతూ రాష్ట్రపతి శీతాకాల విడిదిలో భాగంగా ఈ నెల 18న హైదరాబాద్‌కు వస్తున్నారని, 20న ఉదయం 11:10 నుంచి 12:10 గంటల వరకు పోచంపల్లిలో పర్యటిస్తారని తెలిపారు. అందులో భాగంగా చేనేత కార్మికులతో ముఖాముఖి ఉంటుందని పేర్కొన్నారు. ఆయన వెంట చౌటుప్పల్ ఆర్డీఓ జగన్నాథరావు, తాసీల్దార్ వీరాబాయి, ఎస్ఐ విక్రమ్‌రెడ్డి, ఆర్అండ్‌బీ ఈఈ శంకరయ్య, డీఈ సుగంధర్, ఎంఆర్ఐ గుత్తా వెంకట్‌రెడ్డి, టై అండ్ డై అసోసియేషన్ అధ్యక్షుడు రమేశ్ ఉన్నారు.

## తల‘సిరి’ భేష్

### రాష్ట్ర తలసరి ఆదాయంలో ఆరోస్థానంలో యాదాద్రి జిల్లా

యాదాద్రి భువనగిరి, డిసెంబర్ 13 (నమస్తే తెలంగాణ) : తలసరి ఆదాయంలో యాదాద్రి భువనగిరి జిల్లా భేష్ అనిపించుకుంది. రాష్ట్రంలో ఆరో స్థానంలో నిలిచి రికార్డు నెలకొల్పింది. 2021–22 లెక్కల ప్రకారం తలసరి ఆదాయం రూ. 1,46,265 నమోదైంది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ఎట్ ఏ గ్లాన్స్ రిపోర్ట్‌లో వెల్లడైంది. ఇక ఉమ్మడి జిల్లాలో నల్లగొండ ఎనిమిదో స్థానంలో నిలిచింది. ఈ జిల్లాలో తలసరి ఆదాయం రూ. 1,38,093గా నమోదైంది. రూ. 1,12,555 తలసరి ఆదాయంతో 16వ స్థానంలో సూర్యాపేట నిలిచింది. రంగారెడ్డి జిల్లా రూ. 4,74,404 తలసరి ఆదాయంతో మొదటి స్థానంలో నిలిచింది. కాగా ఒక భౌగోళిక ప్రాంతంలో వ్యక్తి సంపాదించిన డబ్బు మొత్తాన్ని కొలవడమే తలసరి ఆదాయం. ఒక నిర్ధిష్ట ప్రాంతంలో సగటున వ్యక్తి ఆదాయాన్ని అర్థం చేసుకోవడానికి, ఆ ప్రాంతం జీవన నాణ్యతను పరిశీలించడానికి తలసరి ఆదాయాన్ని ఉపయోగిస్తారు.

### జీడీపీలో మెరుగైన స్థానం..

స్థూల జిల్లా దేశీయోత్పత్తిలో ఉమ్మడి జిల్లా మంచి మెరుగైన స్థానం సంపాదించింది. రాష్ట్రంలోనే నల్లగొండ జిల్లా ఐదో స్థానంలో నిలిచింది. నల్లగొండ స్థూల జిల్లా దేశీయోత్పత్తి రూ. 26,965 కోట్లుగా నమోదైంది. రూ. 14,889 కోట్లతో పదో స్థానంలో సూర్యాపేట, రూ. 13,587కోట్లతో 14వ స్థానంలో యాదాద్రి భువనగిరి జిల్లా నిలిచింది. రాష్ట్రవ్యాప్తంగా చూస్తే.. రూ. 1,44,562 కోట్లతో రంగారెడ్డి మొదటి స్థానంలో ఉంది. స్థూల జిల్లా దేశీయోత్పత్తి అంటే ఒక నిర్ణీత కాల వ్యవధిలో ఆ జిల్లాలో ఉత్పత్తి అయిన వస్తువులు, సేవల మార్కెట్ విలువ. స్థూలంగా దేశీయంగా ఉత్పత్తులను కొలిచే ప్రమాణంగా ఇది ఆ జిల్లా ఆర్థిక పరిపుష్టతను సూచిస్తుంది.

## సైనిక పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తులు

భువనగిరి అర్బన్, డిసెంబర్ 13 : 2024–25 విద్యా సంవత్సరానికి గానూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విజయనగరం జిల్లా కోరుకొండ సైనిక పాఠశాలలో 6, 9వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ హనుమంతు కె జెండగే మంగళవారం ఒక ప్రకటనలో సూచించారు. 6వ తరగతిలో ప్రవేశానికి 10 నుంచి 12 సంవత్సరాల వయస్సు కలిగి, 2024 మార్చి 31 వరకు 5వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలని, 9వ తరగతిలో ప్రవేశానికి 13 నుంచి 15 సంవత్సరాల వయస్సు కలిగి, 8వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలని పేర్కొన్నారు. జనరల్, ఎక్స్ సర్వీస్ మెన్, రక్షణ దళాల్లో పని చేసేవారి పిల్లలు, ఓబీసీ విద్యార్థులకు ప్రవేశ పరీక్ష ఫీజు రూ.650, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రూ.500 ఉంటుందని తెలిపారు. https:// exams.nta.ac.in/AISSEE/ వెబ్ సైట్‌లో ఈ నెల 16 వరకు దరఖాస్తు చేసుకోవాలని, జనవరి 21న ప్రవేశపరీక్ష ఉంటుందని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

## పాఠశాలల సమస్త సమాచారం..

# యూ-డైస్

- నేటి నుంచి ఆన్‌లైన్‌లో అందుబాటులోకి..
- యాప్‌లోని సమాచారం ఆధారంగానే నిధుల కేటాయింపు

మునుగోడు, డిసెంబర్ 13 : ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు సంబంధించిన సమస్త సమాచారాన్ని తెలుసుకునేందుకు విద్యాశాఖ యూ–డైస్ విధానానికి శ్రీకారం చుట్టింది. జాతీయస్థాయిలో ఒకే విధానం ఉండేలా యూనిఫైడ్ డిస్ట్రిక్ ఇన్‌ఫర్మేషన్ సిస్టం ఫర్ ఎడ్యుకేషన్(యూ–డైస్)ఫార్మాట్‌ను రూపొందించింది. పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు, బోధన సిబ్బంది, విద్యాసంస్థల స్థితిగతులు, మౌలిక వసతులు, ప్రత్యేక అవసరాలు గల పిల్లల వివరాలను సంబంధిత ఫార్మాట్ల ద్వారా ఆన్‌లైన్‌లో పొందుపరుస్తారు. దాంతో ప్రతి ఒక్కరూ కంప్యూటర్‌లో డైస్ కోడ్‌తో పాఠశాలకు సంబంధించిన పూర్తి సమాచారం తెలుసుకోవచ్చు. అన్ని విద్యాసంస్థల సమాచారాన్ని గురువారం యూడైస్‌లో పొందుపర్చనున్నారు.

### నిధుల కేటాయింపు ఇలా...

ఈ యాప్ ఆధారంగానే విద్యార్థులకు 2023–24 విద్యాసంవత్సరానికి పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్స్, పాఠశాల నిర్వహణ, మధ్యాహ్న భోజనం వంటి సౌకర్యాలతో పాటు పాఠశాల అభివృద్ధికి సంబంధించిన నిధులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్‌లో కేటాయిస్తాయి.

### మునుగోడు మండలంలో..

మునుగోడు మండలంలో 44 ప్రభుత్వ పాఠశాలలు, ఒక కేజీబీవీ, 6 ప్రైవేటు పాఠశాలలు, ఒక గురుకుల పాఠశాల మొత్తం 52 పాఠశాలలు ఉన్నాయి. వీటిలో సుమారు 4,500 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఆయా పాఠశాలల సమాచారాన్ని మూడంచెలుగా పరిశీలించి జిల్లాస్థాయికి పంపించి అక్కడ ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. పాఠశాలలకు సంబంధించిన కచ్చితమైన సమాచారాన్ని పొందుపర్చాల్సి ఉంటుంది. పాఠశాలల్లోని టీచర్లు, విద్యార్థులు, మౌలిక వసతులు, తరగతి గదులు, ఫర్నీచర్ వివరాలు, ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులు, పాఠశాలల్లో విద్యార్థుల కోసం అమలు చేస్తున్న నైపుణ్య కార్యక్రమాలను నమోదు చేస్తారు.




మునుగోడు మండలం లక్ష్మీదేవిగూడెంలోని ప్రభుత్వ పాఠశాల

### మూడంచెల పరిశీలన ఇలా....

డైస్ ఫార్మాట్లను మూడంచెలుగా పరిశీలించాల్సి ఉంటుంది. పాఠశాలల సమగ్ర సమాచారాన్ని మూడంచెలుగా పరిశీలిస్తారు. ప్రధానోపాధ్యాయులు పరిశీలించిన తర్వాత సంబంధిత కాంప్లెక్స్ హెచ్‌ఎంకు అందిస్తారు. ఆయన పరిశీలన అనంతరం ఎమ్మార్సీ కార్యాలయంలో ఎంఈఓ పరిశీలించి డీఈఓ కార్యాలయానికి పంపిస్తారు. డీఈఓ క్షేత్రస్థాయిలో పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదిక అందిస్తారు. జిల్లా స్థాయిలో యూ–డైస్‌పై ఎంఈఓ, కాంప్లెక్స్ హెచ్ ఎంలు, మండలానికో సీనియర్ ఉపాధ్యాయుడిని కేటాయించి ఇప్పటికే శిక్షణ ఇచ్చారు. గురువారం హెచ్‌ఎంలు యూడైస్‌లో నమోదు పూర్తిచేయాలి. అనంతరం పరిశీలన ఉంటుంది.